
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
మంగళవారం 17 డిసెంబరు 2024



బ్యాంకు సేవలకు నాలుగురోజుల అంతరాయం

దుబ్బాక/మిరుదొడ్డి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ బ్యాంకును ప్రభుత్వం విలీనం చేయ డం ద్వారా నాలుగురోజుల పాటు సేవలకు అంతరాయం కలుగుతుందని దుబ్బాక, మిరుదొడ్డి, ఖాజీపూర్ మేనేజర్లు రాజశేఖరు సూచించారు. సోమవారం వారు వేర్వేరుగా బ్యాంకుల్లో మాట్లాడారు. ప్రభుత్వ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ బ్యాంకు విలీనం చేయడం ద్వారా ఈనెల 28 నుంచి 31 వరకు అన్ని రకాల బ్యాంకు సేవలు నిలిచిపోతాయని తెలిపారు. ఖాతాదారులకు అత్యవసర సేవలు ఉంటే ఈనెల 27 వరకు పూర్తిచేసుకోవాలని సూచించారు.



హుస్నాబాద్‌కు మరో పురస్కారం

- స్వచ్ఛభారత్‌లో మున్సిపాలిటీకి ఛేంజ్ మేకర్స్ కాంక్లేవ్ అవార్డు
- 19న ఢిల్లీలో అందజేత

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు వరుస అవార్డుల పంట పండుతోంది. ఇప్పటికే జాతీయస్థాయిలో మూడు అవార్డులు, రాష్ట్రస్థాయిలో రెండు అవార్డులు సొంతం చేసుకున్న హుస్నాబాద్ మున్సిపాలిటీకి మరో అవార్డు దక్కింది. 2021 నుంచి 2024 వరకు స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం, స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమాల్లో మెరుగైన ప్రదర్శన, చెత్తతో నూతన వస్తువుల తయారీ, స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టి జాతీయస్థాయిలో అవార్డులను సొంతం చేసుకుంది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో దేశంలో ఉత్తమ ప్రతిభ చూపిన 100 మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. సిల్వర్ హోక్‌హాల్‌లో సీఎస్ఈ, మోహ్వా సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న చేంజ్ మేకర్స్ కాంక్లేవ్ అవార్డుకు హుస్నాబాద్ ఎంపికైంది. ఈనెల 19న ఢిల్లీలో స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ, నేషనల్ మిషన్ డైరెక్టర్ రూపామిశ్రా నుంచి ఈ అవార్డును పురపాలక సంఘం ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు అధికారి రవికుమార్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత మాట్లాడారు. హుస్నాబాద్ పట్టణ ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను సాధించామన్నారు. ఈ అవార్డులు అందుకోవడం తమకు ఎంతో గర్వంగా ఉందని, ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో పట్టణ ప్రజలు సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ పాటించి మున్సిపాలిటికి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ రజిత, కమిషనర్ మల్లిఖార్జున్ పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ

చేర్యాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మల్లన్న కల్యాణంతో పాటు బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ ఆవరణతోపాటు తోటబావి కల్యాణ మండప మార్గంలో రోడ్డుపైకి చొచ్చుకొచ్చి వస్తు, సామగ్రి ఏర్పాటు చేయొద్దని, ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కొమురవెల్లి ఎస్ఐ రాజు హెచ్చరించారు. సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌తో కలిసి ఆయా దుకాణాల యాజమానులకు ముందస్తు నోటీసులు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు కలిగించేలా మార్గంలో వస్తు సామగ్రి నెలకొల్పిన వారి లైసెన్సు రద్దుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఏం లాభం!

ప్రధాని పట్టాలిచ్చారు.. అధికారులు లాక్కున్నారు..

- ఒకే స్థలం ఇరువర్గాలకు కేటాయింపు
- రెండు దశాబ్దాలుగా కాస్తులో వారే
- ధరణి వచ్చిన తర్వాత పాస్‌బుక్కులు వెనక్కి..
- అప్పటి నుంచి యాజమాన్య హక్కులు కల్పించని అధికారులు
- కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న రైతుల
- అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిన లక్ష్యం
- 'భూమాత'తో అయినా పరిష్కారం చూపాలని వేడుకోలు



పట్టా సర్టిఫికెట్‌లను చూపిస్తున్న బాధితులు

సాక్ష్యాత్తు ప్రధాని చేతుల మీదుగా పట్టాలు అందుకున్నారు. రాళ్లు, ఒర్రెలు, చెట్లు ఉన్న భూమిని కుటుంబమంతా కష్టపడి పంట పొలాలుగా మార్చుకున్నారు. కానీ, ధరణి వచ్చి ఆ పేద రైతుల జీవితాలను ఆగం చేసింది. కాస్తులో వారే ఉన్నప్పటికీ యాజమాన్య హక్కులు లేకపోవడంతో ఆ రైతులకు దిక్కుతోచడం లేదు. అప్పట్లో అధికారులు చేసిన తప్పునకు ఇప్పుడు తిప్పలు పడుతున్నారు. తమ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని దీనంగా వేడుకుంటున్నారు. తాజాగా ప్రభుత్వం ధరణి స్థానంలో భూమాతను తీసుకువస్తున్న నేపథ్యంలో తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

6

దుబ్బాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం ఆకారం గ్రామంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 126 మంది రైతులను ఎంపిక చేసింది. ఒక్కొక్కరికీ ఎకరా చొప్పున సాగు భూమి అందించేందుకు గ్రామానికి చెందిన సర్వేనంబర్లు 670, 671, 672, 673, 690, 687, 688, 689, 690, 692, 1480, 1433, 2156, 44, 199 తోపాటు మరో పది సర్వేనెంబర్లలో 126 ఎకరాల భూమిని కేటాయించింది. 2005 ఆగస్ట్ 15న మెదక్‌లో జరిగిన కార్యక్రమంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ వారికి పట్టాలు అందజేశారు. అయితే, అవే సర్వే నంబర్లలో మండలంలోని శిలాజీనగర్ గ్రామానికి చెందిన గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి ఉంది. సదరు పట్టాలు రద్దు చేయకుండానే బలహీనవర్గాలకు మొత్తం 126 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసింది. దీంతో అప్పటికే పట్టాలు

మిగతా 8వ పేజీలో...

'ధరణి'తో తంటా..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం భూములకు సంబంధించి ధరణిని తీసుకువచ్చారు. ధరణిలో వివాదాస్పదంగా కనిపించడంతో అధికారులు 126 మంది రైతులకు పంపిణీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలను వెనక్కి తీసుకున్నారు.అయితే, రైతుల పేర్లు ధరణిలో చేర్చకుండా.. కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు ఇవ్వకపోవడంతో 126 మంది రైతులు భూములపై యాజమాన్యహక్కులు కోల్పోయే ప్రమాదం నెలకొంది. ఇదే క్రమంలో 126 మంది రైతులకంటే ముందు పట్టాలు పొందిన శిలాజీనగర్ గిరిజనులు ఆ భూములకు తామే అసలైన యాజమానులమంటూ భీష్మించుకుర్చున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది.

అసెంబ్లీలో గళమెత్తిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

చేర్యాల/దుబ్బాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభమైన నేపథ్యంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై గళమెత్తారు. జనగామ నియోజకవర్గంలోని 127 గ్రామాల్లో రూ.45 కోట్ల మేర బిల్లులు బకాయి ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 12 నెలల్లో ఒక్కపైసా విడుదల చేయలేదని, తద్వారా మాజీ సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలోని బచ్చన్నపేట మండలంలో పలువురు సర్పంచులు తమఇల్లు, బంగారం తాకట్టు పెట్టుకున్నారని ఉదహరించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు మహిళా మాజీ సర్పంచుల ఇళ్లకు తెల్లవారుజాములోగానే పోలీసులు వెళ్లి అరెస్టులకు పాల్పడుతూ రజాకార్లను తలపిస్తున్నారన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్లకు ఒక్కపైసా ఇవ్వలే..

'రోడ్లపై గుంతలతో ప్రమాదాలు జరిగి మనుషులు చనిపోతే పట్టింపులేదు. వ్యవసాయానికి ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చింది లేదు. ఏడాదిలో చేసిందేమీ లేదు. దేశ చరిత్రలో అభివృద్ధి కోసం నయా పైసా కూడా కేటాయించని సర్కారును ఇప్పుడే చూస్తున్నాం' అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీలోని క్వశ్చన్ అవర్స్‌లో ఆయన మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీలు చేసిన పనులకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రోడ్ల పరిస్థితిపై అధికారులకు ఫోన్ చేస్తే.. కనీసం పలకడం లేదని అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండవద్దంటే, తాము కూడా ఆలోచించుకుంటామని, ప్రభుత్వం తమపై కోపాన్ని ప్రజలపై చూపుతోందని అన్నారు. నియోజకవర్గంలో రోడ్లు చెడిపోయాయని, వర్షాలకు గుంతలు పడ్డాయని, రోడ్ల మరమ్మతులకు కనీసం ఒక్క పైసా ఇచ్చే పరిస్థితి లేదన్నారు.

వంతెనలు నిర్మించారు.. బీటీ రోడ్డు మరిచారు

- పట్టించుకోని కాంట్రాక్టర్లు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



8

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- పలువురికి గాయాలు
- వేర్వేరు చోట్ల ఘటనలు



7

అటకెక్కిన అర్బన్ పార్కు

- కాజీపల్లి అటవీ అభివృద్ధి శూన్యం
- సినీ హీరో ప్రభాస్ రూ.2 కోట్ల విరాళం
- అయినా ముందుకు సాగని పనులు
- పర్యాటక కేంద్రం.. ప్రకటనకే పరిమితం



7

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- పేపర్-3 పరీక్షకు 13,717 మంది అభ్యర్థులకు 6,869 మంది
- పేపర్-4కు 6,899 మంది హాజరు
- ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతి నిరాకరణ



సిద్దిపేటకల్చరల్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు నాలుగు సెషన్స్‌లో ఈ పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 37 కేంద్రాలు ఏర్పాటుచేశారు. జిల్లాలో పేపర్-3 పరీక్షకు 13,717 మంది అభ్యర్థులకు 6,869 మంది హాజరుకాగా 50.07 శాతం హాజరు నమోదైంది. పేపర్-4 పరీక్షకు 6,899 మంది హాజరయ్యారు. 50.29 శాతం హాజరు నమోదైంది. సెంటర్లను కలెక్టర్ మనుచౌదరి తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలస్యంగా వచ్చిన వారిని నిమిషం నిబంధన కారణంగా హాల్లోకి అనుమతించలేదు. పరీక్ష కోసం వేగంగా వెళ్తున్న మహిళా అభ్యర్థిని సిద్దిపేటలోని డిగ్రీ కాలేజ్ వద్ద ప్రమాదానికి గురై కిందపడింది. దీంతో పక్కనే ఉన్న పోలీసులు అభ్యర్థిని సహాయం చేసి సెంటర్‌కు వెళ్లేలా ఏర్పాటు చేశారు.



అభ్యర్థులను తనిఖీ చేసి సెంటర్‌లోకి పంపిస్తున్న అధికారులు



సిద్దిపేటలోని ఓ సెంటర్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ మనుచౌదరి




ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని అనుమతించని సిబ్బంది

మున్సిపాలిటీలకు పోస్టులు మంజూరు

ఉమ్మడి జిల్లాలో పది బల్దియాల్లో నియామకాలు

తూప్రాన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో నూతనంగా ఆరేళ్ల క్రితం కొత్త కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు ఏర్పాటు చేసినప్పటికీ, కమిషనర్ పోస్టు ఏర్పాటు చేయలేదు. మున్సిపాలిటీలలో ఇంత కాలం మున్సిపల్ సీనియర్ మేనేజర్లు కమిషనర్లుగా కొనసాగారు. రాష్ట్ర వ్యాప్తంగా 86 మున్సిపాలిటీలలో 316 పోస్టులు ఏర్పాటు చేశారు. ఏడుగురు సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లు 43 మంది గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, 41 మంది గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్లు, 11 మంది మేనేజర్లు, రెవెన్యూ ఆఫీసర్లు (కేటగిరి-3), ఏడుగురు హెల్త్ ఆఫీసర్లు, 10 మంది శానిటరీ సూపర్‌వైజర్లు, 86 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 96 మంది హెల్త్ అసిస్టెంట్లు, 15 మంది జూనియర్ అసిస్టెంట్, హెచ్‌ఓడీ, రీజనల్ ఆఫీసర్ పోస్టులు క్రియేట్ చేశారు. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాలో తెల్లాపూర్, బొల్లారం, అమీన్‌పూర్, నారాయణఖేడ్, ఆందోల్-జోగిపేట (సంగారెడ్డి), తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్ (మెదక్), దుబ్బాక, చేర్యాల (సిద్దిపేట) మున్సిపాలిటీలకు కమిషనర్, ఇతర పోస్టులు మంజూరు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ టీకే శ్రీదేవి ఆదేశాలు జారీ చేశారు. గ్రేడ్-2 పరిధిలో తూప్రాన్, దుబ్బాక, తెల్లాపూర్, బొల్లారం, అమీన్‌పూర్, ఆందోల్-జోగిపేట, గ్రేడ్-3 పరిధిలో రామాయంపేట, నర్సాపూర్, చేర్యాల, నారాయణఖేడ్ మున్సిపాలిటీలను చేర్చారు. ఉమ్మడి జిల్లాలోని 10 మున్సిపాలిటీలకు గ్రేడ్-2, గ్రేడ్-3 కమిషనర్ పోస్టులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్‌లు 30 మంజూరు చేశారు.







చలికి తట్టుకోలేక ఎండలో నిల్చున్న గ్రూప్-2 అభ్యర్థులు



వణికిస్తున్న చలి

జిల్లాలో రోజురోజుకూ చలితీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఉదయం 10 దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. ఇక, సాయంత్రం 4 గంటలకే చలి మొదలవుతుంది. చలి నుంచి ఉపశమనం పొందటానికి ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. గ్రామాల్లో చలిమంటలు వేసుకుంటున్నారు. సోమవారం జరిగిన గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు చలి వల్ల కాస్త ఇబ్బంది పడ్డారు. సెంటర్‌లోనికి అనుమతించే వరకు ఎండలో నిల్చున్నారు. చలితీవ్రత, మంచు ప్రభావం వల్ల సూర్యుడి కాంతి తగ్గినట్లు కనిపించింది. కోమటిచెరువుపై తిలకం పెట్టినట్లుగా సూరీడు కనువిందు చేశాడు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్,
డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి)



కూల్చిన శిథిలాలను తొలగిస్తున్న హైడ్రా

పటాన్‌చెరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ సర్వే నంబర్ 12లో గతంలో రెవెన్యూ సిబ్బంది కూల్చివేసిన ఇళ్ల శిథిలాలను సోమవారం హైడ్రా బృందాల పర్యవేక్షణలో తొలగించడం ప్రారంభించారు. కూల్చివేతల అనంతరం శిథిలాలను తొలగించడంపై హైడ్రా దృష్టి సారించింది. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో కూల్చివేతల శిథిలాలలను ఎత్తిపోస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గతంలో శిథిలాలను తొలగించేందుకు ప్రయత్నించగా కోర్టు స్టేటస్ కో కాపీలను ఇళ్ల యజమానులు చూపించగా తిరిగి వెళ్లిపోయారు. తరువాత కూల్చివేతలకు పాల్పడిన 12వ సర్వే నంబర్, ఇళ్ల బాధితుల డాక్యుమెంట్లపై ఉన్న 6 నంబర్ పట్టా సర్వే నంబర్‌ను జిల్లా ఏడీ సర్వేయర్‌తో సర్వే చేపట్టాలని హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఏడీ సర్వే జరగకుండానే హైడ్రా, రెవెన్యూ బృందాలు శిథిలాలను తొలగించేందుకు ఉపక్రమించడంతో కొంత గందరగోళం నెలకొన్నది. ఈ మేరకు బాధితులు కోర్టు ఆర్డర్ ప్రతులను చూపించినా వెనక్కు తగ్గకుండా శిథిలాలను తొలగించే పనులు కొనసాగిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో పూర్తి శిథిలాలను తొలగిస్తామని హైడ్రా సిబ్బంది పేర్కొన్నారు. కాగా శిథిలాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



పటేల్‌గూడలో గతంలో కూల్చిన ఇళ్ల శిథిలాలను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

భూములిచ్చి ప్రయోజనమేమి?

- కాళేశ్వరం 18వ ప్యాకేజీ పనుల గతేమిటి?
- భూములు పోయినా నీళ్లొస్తాయని రైతుల ఆశలు
- ఏడాదిగా నిలిచిన కాలువ పనులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భూనిర్వాసితులు

నర్సాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మెదక్ జిల్లాలో తలపెట్టిన 18వ ప్యాకేజీ కాలువ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏడాది కాలంగా పనులు సాగడం లేదు. కాలువ కోసం భూములు త్యాగం చేసిన రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనాధారమైన భూములను మార్కెట్ ధర కంటే తక్కువకే ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నర్సాపూర్ పరిధిలో అసంపూర్తిగా కాళేశ్వరం కాలువ పనులు

731 మంది రైతుల నుంచి 606 ఎకరాల భూసేకరణ

ఐదు మండలాల్లో 30 గ్రామాల మీదుగా 15 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో 18వ ప్యాకేజ్ ద్వారా కాలువ నిర్మాణ పనులను చేపట్టారు. తూప్రాన్, నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లోని 731 మంది రైతుల నుంచి 606 ఎకరాల భూసేకరణ చేసి 2018లో కాళేశ్వరం కాలువ పనులు చేపట్టారు. పరిహారం విషయంలో రైతులు అప్పట్లో ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేశారు. రైతులకు పట్టాభూమికి ఎకరాకు రూ.7.50లక్షలు, అసైన్డు భూములకు ఎకరాకు రూ.5.50లక్షల చొప్పున పరిహారం అందించారు. తమ భూములు పోయిన ఈ ప్రాంతం బాగుపడుతుందన్న ఉద్దేశంతో తక్కువ ధరైనా రైతులు భూములిచ్చారు. అటు సాగుకు ఉపయోగం లేక ఇటు కాళేశ్వరం కాలువ పూర్తికాక నిరుపయోగంగా ఉండటంపై రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

మెదక్ జిల్లాలో 44 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం

18వ ప్యాకేజీలో భాగంగా మెదక్ జిల్లాలో 44 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం చేపడుతున్నారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలో 3.50 కిలోమీటర్ల దూరం సొరంగం పనులను చేపట్టాల్సి ఉండగా 2.50 కిలోమీటర్లు పూర్తయింది. అంతేకాకుండా ఇప్పటివరకు తవ్విన కాలువకు సంబంధించి ఇంకా సిమెంటు పనులు చేపట్టాల్సి ఉంది. అప్పట్లో ప్రభుత్వం 18వ ప్యాకేజీ కాలువపై దృష్టి సారించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు నత్తనడకన సాగాయన్న విమర్శలు ఉన్నాయి. అయితే, గతేడాది రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ పనులకు మరింత గడ్డు పరిస్థితులు దాపురించాయి. 55 శాతం పనులను పూర్తి చేసిన నిర్మాణ సంస్థ ప్రభుత్వం మారడంతో కొన్ని రోజులకే సిబ్బందితో పాటు సామగ్రి అంతా తీసుకుని వెళ్లిపోయింది. దీంతో పనులు అర్ధాంతరంగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఏడాది అవుతున్నా ఇంకా కాలువ పనులను పట్టించుకోకపోవడంపై భూములు ఇచ్చిన రైతులు మండిపడుతున్నారు.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
>
> కాళేశ్వరం కాలువ పనుల 18వ ప్యాకేజీలో నిలిచిపోయిన విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించగానే త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశముంది.
>
> - రవీందర్, ఈఈ

మంత్రి సానుకూల స్పందనతో చిగురించిన ఆశలు

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సమీక్షలో కాళేశ్వరం ప్రాజెక్టులపై కూడా సానుకూలంగా స్పందించడంతో మెదక్ జిల్లాలోని 18వ ప్యాకేజీ పనులు కూడా మొదలవుతాయన్న ఆశాభావం ఇక్కడి అధికారులలో వ్యక్తమవుతున్నది. ఇక్కడి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు చొరవ తీసుకుని మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఈ పనులు మొదలు పెట్టి పూర్తిచేసి ఈ ప్రాంత రైతులకు మేలు కలిగేలా చూడాలని కోరుతున్నారు.





ఘనంగా దత్తాత్రేయ పల్లకీసేవ

ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో సోమవారం అవధూతగిరి మహరాజ్, సిద్దేశ్వరానందగిరి మహరాజ్, స్వామి వారి పల్లకీసేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన పల్లకిసేవ మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. శోభాయాత్రంలో మహిళలు నిండుకలశములతో పల్లకీసేవకు ఘనంగా స్వాగతం పలికారు. కర్ణాటకలోని చాంగులేరుకు చెందిన కళాకారులు చేసిన దండకాలు, ఖడ్గాలు, భజన కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

- ఝరాసంగం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి)

రాజీవ్ గృహకల్ప ఇల్లు కోసం వేచిచూసి చనిపోయాడు

- ప్రజావాణిలో కన్నీరుమున్నీరైన వృద్ధురాలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తమకు సొంత ఇల్లు వస్తుందని 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాజీవ్ గృహకల్ప ఇల్లు కోసం అప్పు చేసి రూ.49వేలు కట్టినా ఇవ్వలేదని, వేచిచూసి చూసి తన భర్త రాములు అనారోగ్యంతో చనిపోయాడని సంగారెడ్డికి చెందిన వృద్ధురాలు వరలక్ష్మీ కన్నీరుమున్నీరయ్యారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె కలెక్టర్ వల్లూరు క్రాంతికి మొర పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇళ్లను ఇప్పుడైనా ఇవ్వాలని వరలక్ష్మీతో పాటు అర్జీదారులు సురేఖ, మంగళ తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతితో పాటు, డీఆర్వో పద్మజారాణికి అర్జీలు అందజేశారు. పింఛన్లు ఇప్పించాలని, రుణమాఫీ చేయాలని, వివిధ సమస్యలపై ప్రజావాణికి 58 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రజావాణిలో వచ్చిన సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



అర్జీని స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

చౌదరిపల్లిలో తెరుచుకోని బడి



రేగోడు మండలం చౌదరిపల్లిలో మూసిఉన్న పాఠశాల

రేగోడు డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపల్లి ప్రాథమిక పాఠశాల సోమవారం ఉపాధ్యాయులు లేక మూతబడింది. టీచర్లు రాకపోవడంతో విద్యార్థులు ఆరు బయట ఆడుకుని వెళ్లిపోయారు. గ్రామస్థులు మండల అధికారులకు ఫోన్ చేసి ఉపాధ్యాయులు రాలేరని సమాచారం ఇవ్వగా.. ఉన్నత పాఠశాలకు చెందిన టీచర్‌ను పంపించామని చెప్పారు. ఎంఈవో గురునాథ్ వివరణ కోరగా ఉపాధ్యాయులు ఆలస్యంగా వెళ్లడంతో పాఠశాల మధ్యాహ్నం నుంచి కొనసాగిందని తెలిపారు.

యువ ఆవిష్కర్తల కోసం విశ్వకర్మ అవార్డు

- 21, 22 తేదీల్లో ప్రదానం చేయనున్న ఐఐటీహెచ్

కంది, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యువ ఆవిష్కర్తలతో మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు మేకర్ భవన్ ఫౌండేషన్, ఐఐటీ హైదరాబాద్ స్టార్టప్ సంస్థ ఐటీఐసీ ఇంక్యూబేటర్‌లు సంయుక్తంగా విశ్వకర్మ అవార్డ్-2024ను అందజేయనున్నాయి. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ వేదికగా చాలెంజ్, కోలాబ్రెట్, క్రియేట్ థీమ్‌తో ఈ నెల 21, 22 తేదీల్లో ఈ అవార్డులను ప్రకటించనున్నట్లు సోమవారం ఐఐటీహెచ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బైన్ క్యాపిటల్స్ ఇండియా ఆఫీస్ ఛైర్‌పర్సన్ అమిత్ చంద్ర, హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు అజయ్‌చౌదరి హాజరుకానున్నారు. నీరు, పారిశుధ్యం, గ్రీన్ టెక్నాలజీ, స్మార్ట్ మొబిలిటీలపై ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి విద్యార్థి ఆవిష్కర్తలకు ప్రోత్సహిస్తారు. ఐఐటీహెచ్‌లో ప్రపంచస్థాయి సవాళ్లను పరిష్కరించేందుకు సాధికారత కలిగిన ఆవిష్కర్తలను ప్రోత్సహించడానికి తాము కట్టుబడి ఉన్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

గీతంలో ప్రమాణ సెక్రటేరియట్ ప్రారంభం

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 16 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో సోమవారం ప్రమాణ 2025 సచివాలయాన్ని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్.రావు ప్రారంభించారు. గీతంలో ప్రతియేటా సాంకేతిక సాహిత్య నిర్వహణల మేలు కలయికగా నిర్వహించే మూడు రోజుల పండుగకు సన్నాహకంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక శిక్షణ, ఉపన్యాసాలు, ర్యాంప్ వాక్, సింఫోనీ, కన్సర్ట్ బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్ కార్నీవాల్, పలు యాజమాన్య మెలకువలను నేర్పే పోటీల సమాహారంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

అటకెక్కిన అర్బన్ పార్కు

- కాజీపల్లి అటవీ అభివృద్ధి శూన్యం
- సినీ హీరో ప్రభాస్ రూ.2 కోట్ల విరాళం
- అయినా ముందుకు సాగని పనులు
- పర్యాటక కేంద్రం.. ప్రకటనకే పరిమితం

జిన్నారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన జిన్నారం మండలం కాజీపల్లి అటవీ ప్రాంతాన్ని అర్బన్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ప్రముఖ సినీ హీరో ప్రభాస్ ఈ ప్రాంతాన్ని దత్తత తీసుకుని రూ.2 కోట్ల విరాళం కూడా అందించారు. ఈ మేరకు 2020 సెప్టెంబరులో హీరో ప్రభాస్ తోపాటు అప్పటి మంత్రి, కలెక్టర్ సహ పలువురు ప్రముఖులు హాజరై అర్బన్ పార్కు పనులకు శంకుస్థాపన సైతం చేశారు. ఇది జరిగి నాలుగేళ్లు దాటినా ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభించలేదు.


అర్బన్ ఫారెస్ట్‌గా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిన కాజీపల్లి అటవీ ప్రాంతం

అర్బన్ పార్కుకు ప్రణాళికలు..

రాష్ట్ర రాజధానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాజీపల్లి అటవీ ప్రాంతం 1,650 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. నగరంలో వాయు కాలుష్యం భారీగా పెరిగిపోతుండడంతో సమీపంలోనే ఉన్న ఈ ప్రాంతాన్ని దశలవారీగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం పూనుకున్నది. అందులో భాగంగా అర్బన్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందులో వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్, ట్రీ పార్కు, ప్రత్యేక మొక్కల పెంపకం, వ్యూ పాయింట్, వృక్షాలకు రక్షణ చర్యలతో పాటు తదితర వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు వావిలాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కేవలం ఫెన్సింగ్, మట్టి రోడ్డు నిర్మించి ఆ తరువాత చేపట్టాల్సిన ప్రధాన పనులను విస్మరించారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం..

కాజీపల్లి అటవీ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టగా, నాటి ఎంపీ సంతోష్ కుమార్ సూచనతో హీరో ప్రభాస్ తన తండ్రి యూవీఎస్ రాజు విరాళం అందజేశారు. అవసరమైతే మరిన్ని నిధులు అందజేస్తానని ప్రకటించారు. దీంతో అప్పట్లో ఇది ప్రత్యేకత సంతరించుకున్నది. ఎంతో సమున్నత లక్ష్యంతో నిధులు సమకూర్చినా


శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం పార్క్ అభివృద్ధి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హీరో ప్రభాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

పనుల ప్రారంభంలో నిర్లక్ష్యం వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు పార్కు ఏర్పాటు జరుగుతుందా.. లేదా అనేది సందేహం ప్రజల్లో నెలకొన్నది. ప్రభాస్ అందించిన విరాళం ఏ మేరకు ఖర్చు చేశారో తెలియాల్సి ఉన్నది. ఒక మంచి పని కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చినా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు. మండలంలోని వావిలాల ఫారెస్ట్ సెక్షన్ పరిధి ఉన్నా స్థానికంగా సెక్షన్ కార్యాలయం లేకపోవటంతో మండల వాసులకు అటవీ శాఖ అధికారులు ఎవరో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్బన్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

స్టీల్ రాడ్ తగిలి కార్మికుడి మృతి


రాహుల్ (ఫైల్)

మనోహరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్ రాడ్ తగిలి కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలోని ఎమ్ఎస్ ఆగర్వాల్ స్టీల్ పరిశ్రమలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాహుల్ (23) పని చేస్తూ గౌరారంలో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం మధ్యాన్నం పరిశ్రమలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు స్టీల్ రాడ్ పొట్టలో తగిలింది. దీంతో అతడిని వెంటనే కొంపల్లిలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

35 రోజుల వ్యవధిలో ఇద్దరు కార్మికులు మృతి

ఎమ్ఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో 35 రోజుల వ్యవధిలోనే ఇద్దరు కార్మికులు విధుల్లో ప్రమాదం చోటుచేసుకుని మృతి చెందడంపై భద్రతా ఏర్పాట్లపై అనుమానం కలుగుతుంది. గత నెల 12న ఒడిశా రాష్ట్రానికి చెందిన జిన్సుగౌడ్ కన్వేయర్ బెల్టు తగిలి చనిపోగా, ప్రస్తుతం రాహుల్ మృతిచెందాడు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతో కార్మికులకు భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పరిశ్రమపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మిరుదొడ్డి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యాదయ్య(60)కు ఇద్దరు కుమారులు. గతంలో భూమిని విక్రయించి అతని పెద్దకుమారుడు రమేష్‌కు రూ.3.50 లక్షలు ఇచ్చాడు. తర్వాత చిన్నకొడుకు రవికి రూ.50వేలు ఇచ్చాడు. డబ్బుల పంపకాల విషయంలో ఇంట్లో రోజూ గొడవలు జరుగుతున్నాయి. దీన్ని భరించలేక లేక యాదయ్య సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెగిపడిన వైర్లు.. పాడి గేదె మృతి

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


మృతిచెందిన గేదె వద్ద రోదిస్తున్న బాధితుడు మల్లయ్య

అల్లాదుర్గం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తెగిపడి పాడి గేదె మృతి చెందగా, తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాదుర్గంకు చెందిన రైతు మేకలకాడి మల్లయ్య పాడి గేదెలు మేతకు వెళ్లి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్నాయి. గ్రామ శివారులోని శ్రీ రేణుకామాత ఆలయం సమీపంలోకి రాగానే ఎల్‌టీ లైన్‌కు విద్యుత్ తీగ తెగి నేలపై పడుతూ పాడి గేదెకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆ సమయంలో అక్కడున్న రైతులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మృతిచెందిన పాడి గేదె విలువ రూ. లక్ష ఉంటుందని, ఆదుకోవాలని తహసీల్దార్‌ను సోమవారం బాధితుడు కోరాడు.

ఇంట్లో పట్టపగలే చోరీ

- బంగారం, నగదు అపహరణ


చిందరవందరగా పడేసిన వస్తువులు

కంగ్టి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : పట్టపగలే ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన సంఘటన మండల పరిధిలోని దెగుల్‌వాడీలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులరాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దుదాలే రమాదేవి అదే గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తుంది. రోజు మాదిరిగానే సోమవారం ఆమె అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా, భర్త ధన్‌రాజ్ తన తల్లితో కలిసి పొలానికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు మధ్యాహ్నం ఇంటి తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి అందులో ఉంచిన ఐదున్నర తులాల బంగారు నగలు, రూ.1.50 లక్షల నగదు దొంగిలించారు. పొలం నుంచి వచ్చిన ధన్‌రాజ్ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయస్థాయి పోటీలకు వర్గల్ నవోదయ విద్యాలయ బృందం


వర్గల్ విద్యాలయంలో నిర్వహిస్తున్న యూత్ పార్లమెంట్ (ఫైల్)

వర్గల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం యూత్ పార్లమెంట్ బృందం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 26వ జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు 2025 ఫిబ్రవరి నెల4, 5 తేదీల్లో జవహర్ నవోదయ విద్యాలయం నాగపూర్, పూణే రీజియన్లలో నిర్వహించబడుతాయని తెలిపారు. ఎంపికైన వర్గల్ యూత్ పార్లమెంట్ బృందాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అభినందించినట్లు తెలిపారు. సెప్టెంబరులో వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్‌లో ఎంపీ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారని గుర్తు చేశారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

- పదోరోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె పదవ రోజుకు చేరింది. ఇందులో భాగంగా సోమవారం సమ్మె శిబిరం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సమ్మెకు జిన్నారం ఎంఈవో, అమీన్‌పూర్ ఎంఈవోలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని, లేకపోతే మినిమం టైం స్కేలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు, ప్రధాన కార్యదర్శి అనీల్‌చారి, శేషాద్రి, లక్ష్మణ్, రమేశ్, భాస్కర్, లలిత, రాణి, రజిత, భానుశ్రీ, సుజాత, కవిత, విష్ణు, నరేశ్, నర్సింగ్, నాగరాజు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదకు నీలిబాటిళ్లతో చెక్


కల్పగూర్‌లో ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన నీలిరంగు బాటిళ్లు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విశ్వాసానికి ప్రతీకగా నిలిచే శునకాలు (కుక్కలు) ఇటీవల కాలంలో చిన్నా పెద్దా అనే తేడాలు లేకుండా జనాలపై విరుచుకుపడి దాడులు చేస్తున్నాయి. వీటి బారిన పడిన ప్రజలు ఆసుపత్రుల చుట్టు తిరుగుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కల బెడద నుంచి తమ పిల్లలను, తమని తాము రక్షించుకునేందుకు సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామస్థులు వినూత్నంగా ఆలోచించి బట్టలకు వేసే నీలిని వాటర్ బాటిళ్లలో నింపి ఇంటి ఆవరణలో ఏర్పాటు చేశారు. నీళి బాటిళ్లను చూసి కుక్కలు అటు వేళ్లేందుకు సాహసించవని గ్రామస్థులు చెబుతున్నారు. నీలి బాటిళ్లను ఏర్పాటు చేసిన నాటి నుంచి కుక్కల బెడద తగ్గిపోయిందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- పలువురికి గాయాలు ● వేర్వేరు చోట్ల ఘటనలు

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. కల్హేర్ మండలంలో ద్విచక్రవాహనంపై నుంచి పడి వలస కూలీ, మల్కాపూర్ శివారులో లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందారు. ఇక గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బస్సు కారును ఢీకొట్టడంతో ఓ మహిళ మృతిచెందగా, కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు.



కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కల్హేర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతిచెందాడు. స్థానికులు, కల్హేర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన సకల్‌దేవ్(35) ఓ రైసుమిల్లులో కూలీగా పని చేస్తున్నాడు. మరో వలస కూలీ కుందన్‌తో కలిసి అతడు ఆదివారం బాచేపల్లి నుంచి మాసాన్‌పల్లి చౌరస్తా వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. చౌరస్తా సమీపంలో 161 జాతీయ రహదారిపై అదే సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న బాచేపల్లి శెకలికుంటతండాకు చెందిన బాబునాయక్‌ను ఢీకొట్టి కిందపడిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. సకల్‌దేవ్ మార్గమధ్యలోనే మృతిచెందాడు. కిందపడిన వీరిపై నుంచి గర్తు తెలియని వాహనం వెళ్లినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి..

కొండాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సదాశివపేట మండలం నాగ్‌సాన్‌పల్లికి చెందిన వెండికోల్ రాహుల్ (20) సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై తన అక్కను తీసుకుని సంగారెడ్డిలోని రాజంపేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో మల్కాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై కిష్టయ్యగూడెం చౌరస్తా వద్దకు రాగానే సంగారెడ్డి వైపు నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో రాహుల్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరిశంకర్ తెలిపారు.

కారును ఢీకొట్టిన బస్సు ఘటనలో..

గజ్వేల్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారును వెనక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని దమ్మాయిగూడకు చెందిన మోతే సుధాకర్, శ్రావణి దంపతులకు సాయి, లతీక్ ఇద్దరు కుమారులు. మిరుదొడ్డిలో ఉండే సమీప బంధువు చనిపోవడంతో సోమవారం జరిగే దశదినకర్మకు సోదరుడు గణేష్, భార్య శ్రావణి(38) పిల్లలతో కలిసి కారులో బయలుదేరారు. ఇదే సమయంలో జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జేబీఎస్ నుంచి జగిత్యాలకు వెళ్తుంది. రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ తర్వాత ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మోతే సుధాకర్ కారును క్యాసారం వైపు వెళ్లేందుకు మలుపు తిప్పడంతో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టింది. దీంతో శ్రావణి, లతీక్‌కు తీవ్ర గాయాలు కాగా, సుధాకర్, గణేష్, సాయికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా శ్రావణి చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగతా క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం వంటిమామిడిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారులను అభివృద్ధి చేయాలి

- ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రోడ్లను అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని బీదర్ ఎంపీ సాగర్‌కండ్రే తదితరులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల అనసంధాన్ని పెంపొందిస్తే రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందన్నారు. మెదక్, వికారాబాద్ సంగారెడ్డి జిల్లాలోని రహదారుల ప్రాముఖ్యతను వివరించారు. పరిశ్రమల కేంద్రాలుగా సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు ప్రాచుర్యం పొందుతున్నాయన్నారు. మెదక్ ఆటోమొబైల్ తయారీ, పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిందన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), ప్రముఖ సిమెంటు సంస్థలు తాండూరులో స్థాపించిన నేపథ్యంలో రహదారుల అనుసంధానం ఆవశ్యమన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని రోడ్ల అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.


కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

ఎల్లమ్మతల్లికి 11కిలోల వెండి కవచములు


అధికారులకు వెండి కవచములను అందజేస్తున్న దృశ్యం


చేర్యాల, డిసెంబరు 16: స్వర్ణమకుటం, కోరమీసరాజసంతో దర్శనమిస్తున్న కొమురవెల్లి మల్లన్న మాదిరిగా గుట్టపై కొలువుదీరిన స్వామివారి సహోదరి ఎల్లమ్మతల్లి, పోచమ్మతల్లి భక్తులకు ఇక నుంచి రజత మయంతో దర్శనమివ్వనుంది. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన గిల్లా కుమార్‌యాదవ్ రూ.10లక్షల వ్యయంతో 11కిలోల వెండి కవచములు తయారు చేయించి బహూకరించారు. సోమవారం ఆలయ పర్యవేక్షకుడు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, శంకర్ సమక్షంలో కవచాలను అధికారులకు అందించి మొక్కులు చెల్లించుకున్నాడు. మల్లన్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్లకు వీటిని అలంకరించనున్నారు. అలాగే స్వామివారి నిత్య ప్రసాద తయారీశాలలో రూ.3లక్షల వ్యయంతో ఫర్నీచర్ చేయించి ఉదారత చాటుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, ఉప ప్రధాన అర్చకుడు మహదేవుని సాంబయ్య, మల్లికార్జున్ స్వామివారిప్రసాదం అందించి కుమార్‌యాదవ్ దంపతులను ఆశీర్వదించారు.

వాగ్దానాల్లోనే రూ.కోట్లు..

- నిధుల కేటాయింపులో ఏడుపాయలకు మొండి చెయ్యి

పాపన్నపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాగ్దానాలు కోటలు దాటితే అభివృద్ధి అడుగు దాటదన్న సామెతకు సరిపోతుంది ఏడుపాయల అభివృద్ధి తీరు. గత ప్రభుత్వం ఏడుపాయల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయలేదు గానీ తాము అధికారంలోకి వస్తే మరిన్ని నిధులతో ఆధ్యాత్మిక క్షేత్రాన్ని పర్యాటక క్షేత్రంగా మారుస్తామని ఓ బహిరంగ సభలో ప్రకటన చేసిన కాంగ్రెస్.. తీరా అధికారంలోకి వచ్చినంక పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం నిధుల విడుదలలో ఏడుపాయలపై వివక్ష చూపుతుందన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనమేజయుడు సర్పయాగం చేసిన స్థలిగా గరుడ గంగగా పిలవబడే మంజీరా నది ఏడుపాయలుగా చీలి ప్రవహించే స్థలిలో వెలసిన ఏడుపాయల దుర్గామాత ఏటా లక్షలాది భక్తుల ఇలవేలుపై మొక్కులు అందుకుంటుంది. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన ఏడుపాయల దుర్గమ్మ ఆలయ అభివృద్ధిని పక్కన బెట్టి ఇతరత్రా ఆలయాలకు ప్రాముఖ్యతనిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద తాము అధికారంలోకి వస్తె ఏడుపాయల ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రాలుగా అభివృద్ధి చేస్తామన్న హామీని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ఏటా రూ.10 కోట్లకు పైనే ఆదాయం వచ్చే క్షేత్రాన్ని వదిలిపెట్టి ప్రభుత్వానికి ఆదాయ వనరులు కల్పించని వాటికి నిధులు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. ఏడుపాయల ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తే భక్తులకు సౌకర్యాలు కల్పించే వీలుంటుంది.

ఆసియా ఖండంలోనే రెండవ అతి పెద్ద చర్చిగా వెలుగొందుతున్న ఆలయానికి ప్రపంచ దేశాల నుంచి చర్చి అభివృద్ధి కోసం డాలర్ల రూపేణా కోట్ల రూపాయలు నిధులు వస్తుంటాయి. అయినా ప్రభుత్వం రూ.29 కోట్లు కేటాయించడం హర్షదాయకమైనప్పటికీ ఇదే తరహాలో ఏడుపాయల పర్యాటక అభివృద్ధికి కేటాయిస్తే ఈ ప్రాంత ప్రజలు మరింత హర్షించేవారు. స్థానిక ఎమ్మెల్యే ఏడుపాయలకు కూడా పెద్దపీట వేయడమే కాకుండా మెదక్ జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా మార్చడానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని చెబుతన్నా.. ముందుగా ఏడుపాయలకు నిధుల కేటాయింపు జరిగి ఉంటే బాగుండేదని భక్తులు చర్చించుకుంటున్నారు. ఇదిఇలా ఉంటే ఎన్ని ప్రభుత్వాలు మారినా హామీలకే పర్యాటకం అన్న చందంగా మిగలనుందా అన్న విమర్శలు కూడా లేకపోలేవు.


ఏడుపాయల వన దుర్గా మాత ఆలయం

క్రైం కార్నర్

హైనా దాడిలో గొర్రె మృతి

కొండపాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం జప్తినాచారం శివారులో హైనా సంచరిస్తుంది. రెండురోజుల నుంచి వ్యవసాయ బావుల వద్ద సంచరిస్తున్నట్టు రైతులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన యమ ఉప్పలయ్య తన గొర్రెలను వ్యవసాయ పొలం వద్ద ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున హైనా దాడిచేసి ఒక గొర్రెను చంపేసింది. ఆదివారం లేగదూడను చంపేసిన విషయం తెలిసిందే. గుర్తు తెలియని జంతువు కనబడిందని గ్రామస్థులు తెలిపారు. దూరం నుంచి గమనించినట్టు పేర్కొన్నారు. కాగా వరుసగా హైనా దాడిచేసి మూగజీవాలను చంపేస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు.

ట్రాక్టర్ బ్యాటరీల అపహరణ

చేర్యాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పలువురు రైతుల ట్రాక్టర్ బ్యాటరీలు అపహరించుకుపోయారు. గ్రామానికి చెందిన వాసు, రాజులు వ్యవసాయ పనులు ముగించుకుని రాత్రి తమ ఇళ్ల ఆవరణలో, అలాగే వ్యవసాయ బావుల వద్ద గణేశ్, కనకయ్య ట్రాక్టర్లను పార్కింగ్ చేశారు. గుర్తు తెలియని అగంతకులు ఆయా ట్రాక్టర్ల బ్యాటరీలను అపహరించుకుపోగా, సోమవారం ఉదయం పరిశీలించి చోరీకి గురైన విషయాన్ని గమనించి పోలీసులకు తెలిపారు. అగంతకులను గుర్తించి పోలీసులు తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

'నారు మడుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

చిన్నకోడూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరి నారు మడుల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్‌కుమార్ సూచించారు. మండలంలోని మైలారం, అల్లీపూర్, విఠలాపూర్, రామంచ గ్రామాల్లో వరి నారు మడులను సోమవారం ఏఈవోలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కులేదు'

దుబ్బాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కులేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కనకరాజు అన్నారు. సోమవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఆరోపించారు. దానిని పునరుద్ధరించడానికే సీఎం రేవంత్‌రెడ్డి నడుం బిగించారన్నారు.

గుర్రాల శ్రీనివాస్, రవికి సేవారత్న అవార్డు

దుబ్బాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక మండలం తిమ్మాపూర్, పెద్దచీకోడు గ్రామాలకు చెందిన గుర్రాల శ్రీనివాస్, కుంబాల రవికి సోమవారం ఢిల్లీలో సేవారత్న జాతీయ అవార్డును బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు రాధకృష్ణ అందజేశారు.

'ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి'

చేర్యాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై తీర్మానం చేయాలని బీఆర్ఎస్ కొమురవెల్లి మండల నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. సోమవారం కొమురవెల్లి మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడుదశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితంగా సాధించుకున్న వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

'ప్రజలకు రాజ్యాంగ హక్కులను వివరించాలి'

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు రాజ్యాంగ హక్కుల గురించి వివరించాలని పరిరక్షణ కమిటీ చైర్మన్ అల్లం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సిద్దిపేటలో ప్రజా మానవ పరిరక్షణ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సిద్దిపేట జిల్లా ప్రజా మానవ పరిరక్షణ కమిటీ జిల్లా చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం కమిటీ సభ్యులకు ఐడీకార్డులను అందజేశారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

ధూళిమిట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ ధూళిమిట్ట మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జి సుందరగిరి భాస్కర్ తెలిపారు. మండలాధ్యక్షుడిగా నల్ల రాజేష్, ఉపాధ్యక్షుడిగా పేరం బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా మదాసు ప్రశాంత్, కార్యదర్శులుగా గొల్లూరి సురేష్, పోతరాజు చిన్న కనకయ్య, పెరిక కనకరాజు, కోశాధికారిగా లింగాల సాగర్,అధికార ప్రతినిధిగా నాగులపల్లి సంపత్, సలహాదారులుగా దాసారం బాలక్రిష్ణ, కనకస్వామి, పంగ ఎల్లయ్య, గుండె చందర్, ఎర్ర కనకయ్య, నాగులపల్లి కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మండల కమిటీ సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

'వసతులు కల్పించాలి'

చేర్యాల: రాజీవ్ రహదారి వద్ద కొమురవెల్లి మల్లన్న ఆలయ స్వాగత తోరణ సమీపంలో బస్‌షెల్టర్ ఏర్పాటుచేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు.



రింగ్ రోడ్డులో భాగంగా బీటీరోడ్డు వేయకుండా వదిలేసిన మల్యాల బ్రిడ్జి



మాటిండ్ల-జిల్లెల్ల గ్రామాల మధ్య నక్కవాగుపై అసంపూర్తిగా కాజ్‌వే బ్రిడ్జి

వంతెనలు నిర్మించారు.. బీటీరోడ్డు మరిచారు

- పట్టించుకోని కాంట్రాక్టర్లు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

సిద్దిపేట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ రోడ్లను బీటీరోడ్లుగా మార్చితే గ్రామాల మధ్య దూరభారం తగ్గడంతో పాటు ప్రయాణం సుఖవంతంగా ఉంటుందని ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా క్షేత్రస్థాయిలో అమలుచేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. నారాయణరావుపేట మండలం మల్యాల వద్ద రెండు వరసల రింగ్‌రోడ్డు పనుల్లో భాగంగా గ్రామ శివారులో మల్యాల నుంచి సిరిసిల్ల రోడ్డు మధ్యలో గతేడాది వర్షాకాలం కంటే ముందే కాంట్రాక్టర్ పనులు పూర్తిచేసి చేతులు దులుపుకున్నారు. దీంతో మట్టి కుంగి, బురద కావడంతో ప్రయాణం ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మాటిండ్ల నుంచి జిల్లెల్ల గ్రామానికి వెళ్లే రోడ్డులో నక్కవాగుపై కాజ్‌వే నిర్మాణ పనులు చేసి బిల్లులు రావడం లేదనే సాకుతో కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే వదిలేశారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇంద్రగూడెం నుంచి అప్పనపల్లి వెళ్లే మట్టి రోడ్డులో సైతం కాజ్‌వేలు, కల్వర్టుల నిర్మాణం పూర్తి చేసినా బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఆ రోడ్లకు బీటీ ఎప్పుడు వేస్తారని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రమాదకరంగా మల్యాల బ్రిడ్జి

మల్యాల వద్ద నిర్మించిన బ్రిడ్జి వద్ద మట్టి రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. బ్రిడ్జి వద్ద మట్టి కుంగిపోవడంతో సిమెంటు బ్రిడ్జి స్లాబ్‌కు స్పీడ్ బ్రేకర్ వలే గుద్దుకుని తరచూ వాహనాలు మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. మట్టి కుంగినప్పుడు గ్రామస్థుల సహకారంతో రెండుసార్లు మట్టి పోసినా ప్రయోజనం లేకుండాపోయింది. మాటిండ్ల-జిల్లెల్ల గ్రామాల మధ్య నక్కవాగుపై అసంపూర్తిగా ఉన్న కాజ్‌వే బ్రిడ్జి, బీటీ పనులపై అధికారులు స్పందించి బ్రిడ్జిల వద్ద బీటీరోడ్డు పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి బీటీరోడ్డు వేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి దగ్గర మట్టి కుంగిపోయి బైక్‌లు స్కిడ్ అయి పడిపోతున్నారు. చిన్నపాటి వర్షం పడ్డా బ్రిడ్జి వద్ద బురదగా మారి నడవటానికే ఇబ్బందిగా ఉంది. కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోవడం మరిచిపోయారు. వెంటనే బీటీ రోడ్డు వేసి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి.

\- అమర్‌రెడ్డి, గ్రామస్థుడు, మల్యాల

ఏం లాభం!

ఐదో పేజీ తరువాయి..

పొందిన గిరిజనులు కోర్టును ఆశ్రయించారు. ప్రధాని చేతుల మీదుగా పట్టాలు పొందిన రైతులూ ఎడ్ల బండ్లు కట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరిగారు. స్పందించిన ప్రభుత్వం బలహీనవర్గాల వారికి భూములు చూపిస్తూ, హద్దులనూ నిర్ధేశించింది. తమకు కేటాయించిన భూముల్లో రాళ్లు, ఒర్రెలు, చెట్లు, పుట్టలు ఉండగా వారంతా కష్టపడి ఆ భూమిని వ్యవసాయ యోగ్యమైన భూమిగా మార్చుకున్నారు. బోర్లు వేసుకుని వరితోపాటు ఆరుతడి పంటలు పండించుకుంటున్నారు.

రాజీ కుదిర్చినా..

గిరిజనులు, 126 మంది రైతుల మధ్య వివాదం నేపథ్యంలో గత కలెక్టర్ స్పందించారు. ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి.. ఇరువర్గాలకు సమానంగా భూములు కేటాయించాలని నిర్ణయించారు. ఇందుకు రెండు వర్గాలూ అంగీకరించాయి. కలెక్టర్ ఎదుట ఈ మేరకు అంగీకారం జరిగింది. ఈ మేరకు సంబంధిత ఫైళ్లు ఆర్డీవోకు పంపారు. అక్కడి నుంచి దుబ్బాక తహసీల్దార్ కార్యాలయానికి ఫైళ్లు వచ్చినా.. సాంకేతిక కారణాలతో అవి ఆగిపోయినట్లు తెలుస్తోంది.

పథకాలకు దూరం..


ధరణి వచ్చిన తర్వాత 126 మంది రైతుల పట్టాదారు పాస్‌బుక్‌లు లేకపోవడంతో వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన రైతుబంధు పథకం వీరికి వర్తించలేదు. సబ్సీడీలూ అందలేని పరిస్థితి. ఇక భూములు ఉన్నా.. బ్యాంకుల్లో అప్పులు పుట్టని పరిస్థితి నెలకొంది. రెండు దశాబ్దాల పాటు భూమిని నమ్ముకుని బతుకుతున్న 126 మంది రైతులు తమ పరిస్థితి ఏమిటో తెలియక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తాము సాగుచేసుకుంటున్న భూముల యాజమాన్య హక్కులు కల్పించాలని కోరుతున్నారు. సాక్షాత్తు దేశ ప్రధాని చేతుల మీదుగా పట్టాలు అందుకున్న తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ద్వారా పేదలకు పట్టాలు పంపిణీ చేయగా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో శోచనీయం. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉండటంతో ఈ సమస్యను పరిష్కరించాలి. పేద రైతులు ఏళ్ల తరబడి భూమి హక్కుల కోసం పోరాడుతున్నారు. కొత్తగా తీసుకువస్తున్న భూమాతలో అయినా రైతుల సమస్యలు పరిష్కరించాలి.

\- పి.శంకర్, రాష్ట్ర కన్వీనర్, దళిత బహుజన ఫ్రంట్





ప్రభుత్వం అందించిన పట్టా సర్టిఫికెట్లు, కాస్తు చేసుకున్న భూమి

మౌలిక వసతుల కల్పనలో రాజీపడొద్దు: డీఈవో

మర్కుక్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే, వసతి గృహంలో ఉండి చదివే పిల్లలకు మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు రాజీ పడవద్దని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని భవనందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని ఎంఈవో వెంకట్‌రాములుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భావనందాపూర్ పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించడంతో పాటు మధ్యాహ్న భోజనం అమలు విధానాన్ని పరిశీలించారు. అనంతరం కేజీబీవీ వసతి గృహాన్ని సందర్శించి స్టోర్‌రూమ్, డార్మెటరీలను పరిశీలించారు. హాస్టల్‌కు వస్తున్న గుడ్లు, ఇతర సరుకుల నాణ్యత, విద్యార్థులకు అందిస్తున్న డైట్ మెనూ, బెడ్స్ సౌకర్యం, విద్యార్థుల పఠనా సమర్థ్యాలను తదితర వివరాలను తెలుసుకున్నారు. కేజీబీవీ పదో తరగతి విద్యార్థుల ఫిజిక్స్ బోధించే ఉపాధ్యాయురాలు లేదని జిల్లా విద్యాధికారి దృష్టికి విద్యార్థులు తెచ్చారు. మర్కుక్ జిల్లా పరిషత్ టీచర్స్‌తో సిలబస్ పూర్తి చేయించాలని ఎంఈవోను ఆదేశించారు. అనంతరం కేజీబీవీ విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ భావనందాపూర్ పాఠశాలలో విద్యార్థులు చదువులో బాగా వెనకబడి ఉన్నారని, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.



మర్కుక్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

హుస్నాబాద్‌రూరల్/మద్దూరు/ములుగు/మిరుదొడ్డి/చేర్యాల/సిద్దిపేట క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని సోమవారం అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్‌కు వెళ్లకుండా హుస్నాబాద్ మండలంలోని తాజా మాజీ సర్పంచులు తొడేటి రమేష్, బత్తుల మల్లయ్య, సాయన్న, సంపత్, గీకురు వెంకటేశంను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గంగం మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. మద్దూరు మండలంలోని లద్నూరు సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ధర్మారం సర్పంచ్ వూట్ల రవీందర్‌రెడ్డి, మర్మాముల మాజీ ఎంపీటీసీ సుందరగిరి పరశురాములను, ములుగు మండలంలో మాజీ సర్పంచులు కుంట్ల వెంకట్‌రెడ్డి, మహేష్‌గౌడ్, నరసింహులును, మిరుదొడ్డిలో సర్పంచుల ఫోరం మిరుదొడ్డి మాజీ మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, సర్పంచులు బాల్‌నర్సింలు, రాములును అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చేర్యాల మండలంలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, కొండపాక భిక్షపతి, తివారి దినేశ్, సొంటిరెక్కల భిక్షపతి, ఫకీర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సర్పంచుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని సిద్దిపేట నియోజకవర్గ మాజీ సర్పంచులు కాల్వ ఎల్లయ్య, ఉమేష్ చంద్ర, అంజనేయులు, పరశురాములుగౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచుల ఆవేదనను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు మాజీ మంత్రి హరీశ్‌రావుకుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అజీజ్, నవీన్, రవీందర్‌గౌడ్, బిక్షపతినాయక్ పాల్గొన్నారు.



హుస్నాబాద్ రూరల్: అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మాజీ సర్పంచులను అరెస్ట్ చేసిన పోలీసులు


ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో తప్పులు దొర్లొద్దు: ఎంపీడీవో

మద్దూరు/ధూళిమిట్ట/చేర్యాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు చేపడుతున్న సర్వేలో సెక్రటరీలు యాప్‌లో తప్పులు దొర్లకుండా వివరాలు నమోదు చేయాలని ఎంపీడీవో ఎస్.రామ్మోహన్ సూచించారు. సోమవారం మద్దూరు మండలం గాగిళ్లాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో 10,422 మంది ప్రజాపాలన దరఖాస్తుల్లో ఇళ్ల కోసం నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈరోజు వరకు 550 ఇళ్లను సందర్శించి ఇంటి వివరాలను నమోదు చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జాలపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను గ్రామపంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వేచేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు సాగర్‌గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఇంటింటి సర్వేను కాంగ్రెస్ కొమురవెల్లి గ్రామశాఖ అధ్యక్షుడు లింగంపల్లి కనకరాజు, మల్లన్న ఆలయ ధర్మకర్త లింగంపల్లి శ్రీనివాస్ పరిశీలించారు.

'భగీరథ' నీరు పొలానికి..

- వాటర్‌మన్ తీరుపై స్థానికుల ఆగ్రహం

చేర్యాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీటిని వాటర్‌మన్ తన పంట పొలానికి అక్రమంగా వినియోగించుకుంటున్నాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సక్రమంగా తాగునీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్య వహిస్తూ.. తన పొలానికి నీటిని వాడుకునేందుకు మాత్రం ఉద్దేశపూర్వకంగా వాటర్‌ట్యాంక్ నింపి ఓవర్‌ఫ్లో అయ్యేలా చూస్తున్నాడని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గతంలో మిషన్ భగీరథ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మిషన్ భగీరథ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ట్యాంక్ నుంచి ఓవర్‌ఫ్లో అయ్యి పొలంలో పడుతున్న నీరు

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం: వంటేరు

గజ్వేల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనేక అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసిందేమీ లేదన్నారు. గ్రామాలు, పట్టణాలకు నిధులు కేటాయించకపోవడంతో పారిశుధ్యం పడకేసిందన్నారు. రైతులకు రుణమాఫీ పూర్తిగా చేయలేదని, రైతుభరోసా ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి స్కీం అటకెక్కిందన్నారు. గురుకులాలను పట్టించుకునే నాధుడే లేడని, ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే కాస్మెటిక్, డైట్ చార్జీల పెంపు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మెట్టు సాయికుమార్

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్, డైట్ చార్జీలను పెంచారని రాష్ట్ర ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలబడిందన్నారు. హాస్టల్ విద్యార్థుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడితే బీఆర్ఎస్ నాయకులు తమ కాంట్రాక్టర్లు కమీషన్ల కోసమే పాటు పడ్డారని విమర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి హాస్టల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఉన్నారు.

ధనుర్మాసానికి ఎంతో విశిష్టత

- విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి

వర్గల్/హుస్నాబాద్‌రూరల్/సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైనదని, ఈ పర్వదినాలలో గోదాదేవి అమ్మవారిని అర్చిస్తే సకల శుభాలు కలుగుతాయని వర్గల్ విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. సోమవారం ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా విద్యాధరి క్షేత్రంలోని ఉప ఆలయమైన శ్రీభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన విశేష పంచామృతాభిషేకాలు, అనంతరం అష్టోత్తర సహస్ర నామాలతో తులసి, బిల్వ, పుష్పార్చన నిర్వహించారు. నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో సోమవారం ధనుర్మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వంగీపురం శ్రీనివాసాచార్యులచే తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. అలాగే హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి శ్రీతారామచంద్రస్వామి ఆలయంలో డిసెంబరు 16 నుంచి జనవరి 19 వరకు ధనుర్మాస వ్రతమహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

శివుడికి ప్రీతిపాత్రం శివ ముక్కోటి

కొండపాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం ఎంత ప్రాశస్త్యమైనదో శివ ముక్కోటి కూడా అంతే ప్రాధాన్యత గల పర్వదినమని దేవీ ఉపాసకులు చెప్పెల హరినాథశర్మ అన్నారు. కొండపాక మండలం మర్పడగలోని విజయదుర్గా సమేత సంతానమల్లికార్జున స్వామి క్షేత్రంలో శివముక్కోటి ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసంలో వచ్చే ఆర్ద్రా నక్షత్రానికి ఆర్ద్రోత్సవమని, శివ ముక్కోటి అని పేరని ఆయన అన్నారు. శివ ముక్కోటిని పురస్కరించుకుని బ్రాహ్మీ ముహూర్తంలో మహాగణాధిపతి పూజతో ఉత్సవాలు ఆరంభమయ్యాయి. ఉదయం పది గంటల నుంచి స్వస్తివాచనం జరిపి, కలశ స్థాపన నవగ్రహ, దిక్పాలక స్థాపన, స్థాపితం దేవతా పూజా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు గట్టు విఠల్, మర్యాల రవీందర్, తిరుపతిరెడ్డి, శ్రీశైలం, లగిశెట్టి రాజు పాల్గొన్నారు. సిద్దిపేటలోని మోహినీపురలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.



సిద్దిపేట కల్చరల్: ప్రత్యేక అలంకరణలో ఆలయం

డంపింగ్‌యార్డు పరిశీలన

గజ్వేల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని డంపింగ్‌యార్డును మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఎస్‌టీపీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డంపింగ్‌యార్డులో నాటిన ప్రతీ మొక్కను జాగ్రత్తంగా కాపాడాలని సూచించారు. డంపింగ్‌యార్డు చుట్టూ ఉన్న గోడలపై కలర్ పెయింటింగ్ వేయించాలని సూచించారు. ఆయనవెంట మునిసిపల్ ఏఈ మహేశ్ తదితరులున్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజమౌళి

అందె భాస్కర్‌కు సన్మానం



భాస్కర్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గల్లీ నుంచి ఢిల్లీ దాకా డప్పుచప్పుడుతో పరిచయమైన భాస్కర్ విదేశాల్లో కూడా డప్పును ప్రదర్శించడం తెలంగాణకే గర్వకారణమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత భాస్కర్‌ను డీబీఎఫ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీహరియాదవ్, బీఆర్ఎస్ నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, లింగం, భైరయ్య, హైమ్మద్, నర్సింహులు పాల్గొన్నారు. అలాగే మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో యాంటీఫర్ డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా 2కె రన్‌ను బక్కి వెంకటయ్య ప్రారంభించారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మెమోరాండం

మద్దూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాల అధికారులకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి మాట్లాడారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేర్యాల, కొమరవెల్లి, మద్దూరు, దూళిమట్ట మండలాలను సిద్దిపేట జిల్లాలో కొనసాగిస్తూ చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ షఫీ, నాయకులు రమేష్, కనకయ్య పాల్గొన్నారు.

'ఎల్లమ్మ చెరువు కాలువలకు మరమ్మతు చేపట్టాలి'

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కింద వ్యవసాయానికి సంబంధించిన నీటి కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి నీటి పారుదలశాఖ అధికారులను కోరారు. సోమవారం చెరువు కాలువలను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. చెరవుకు నీటికి సంబంధించిన కుడి, ఎడమ కాలువల్లో పూడుకుపోయిన మట్టిని తొలగించి రైతులకు రబీ సాగుకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు రాములు, శ్రీధర్ పాల్గొన్నారు.

'బాసంగారి రమేష్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'

సిద్దిపేట క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ బాసంగారి రమేష్‌ను యువ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజనర్సు అన్నారు. సోమవారం భారత్ నగర్‌లో రమేష్ విగ్రహం వద్ద బాసంగారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 24 వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజనర్సు పాల్గొని మాట్లాడారు. రమేష్ పదవుల కోసం కాదని, పేదల సంక్షేమం కోసం పనిచేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పాల సాయిరాం, బీజేపీ నాయకులు జనార్దన్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు సిద్దిపేటలోని బాసంగారి రమేష్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.